పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 731 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ బుధవారం 30.09.2026 పేజీలు : 8 వెల : 4/-

## కొత్త సైబర్ మోసం

# ఉన్నత విద్యావంతులే లక్ష్యం

- బాధితుల్లో ఐటీ నిపుణులు, డాక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు
- ఐఐటీ మద్రాస్ అధ్యయనంలో వెల్లడైన కీలక వాస్తవాలు
- మానసిక ఒత్తిడిలో ఉన్నవారినే లక్ష్యంగా చేసుకుంటున్న కేటుగాళ్లు
- డిజిటల్ అక్షరాస్యత మోసాల నుంచి రక్షించలేదన్న నివేదిక



సైబర్ ఆర్థిక మోసాల బారిన కేవలం నిరక్షరాస్యులు, అవగాహన లేని వారు మాత్రమే పడతారనే అపోహను ఐఐటీ మద్రాస్ తాజా అధ్యయనం పటాపంచలు చేసింది. ఉన్నత విద్యావంతులు, డిజిటల్ పరిజ్ఞానం కలిగిన ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో ఈ మోసాలకు గురవుతున్నారని ఈ పరిశోధన స్పష్టం చేసింది. కేవలం డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండటం ఒక్కటే సైబర్ నేరాల నుంచి పూర్తి రక్షణ కల్పించలేదని ఈ నివేదిక తేల్చి చెప్పింది. ఐఐటీ మద్రాస్‌కు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి, ప్రొఫెసర్ పి. కందస్వామి, ప్రొఫెసర్ నందన్ సుదర్శనం నేతృత్వంలో ఈ అధ్యయనం సాగింది. ఇందుకోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లోని బాధితులపై సర్వే నిర్వహించారు. బాధితుల్లో ఐటీ నిపుణులు, బ్యాంకు ఉద్యోగులు, వైద్యులు, ఆర్థిక రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో పాటు సైబర్ సెక్యూరిటీ తరువాయి 2లో

## పల్లె పండుగ 3.0

# పల్లెలకు రూ.11,085 కోట్లు

- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి,

**ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు**



**సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ**

రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ 3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి తరువాయి 2లో

# రైతు బజార్లలో రూ. 35కే కిలో ఉల్లి

- ఉల్లి ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి
- రైతు బజార్లలో కిలో ఉల్లి రూ. 35కే విక్రయం
- మొదటి దశలో విజయవాడలో రేపటి నుంచి అమ్మకాలు
- కుటుంబానికి నెలకు 2 కిలోల చొప్పున పంపిణీ



సామాన్యులకు ఊరటనిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ఉల్లి ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలను రూ. 35కే సబ్సిడీ ధరతో విక్రయించనున్నారు. తొలిదశలో భాగంగా రేపటి (సెప్టెంబర్ 30) నుంచి విజయవాడలోని అన్ని రైతు బజార్లలో ఈ విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ విక్రయాల కోసం ఆధార్ లేదా రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు 2 కిలోల వరకు సబ్సిడీ ఉల్లిపాయలు అందజేస్తారు. సామాన్యులపై పెరుగుతున్న ఉల్లి ధరల భారాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. విజయవాడలో లభించే స్పందన, డిమాండ్‌ను బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లకు ఈ పథకాన్ని విస్తరించాలని తరువాయి 2లో



## యుద్ధ సన్నద్ధత

# క్షిపణుల నిల్వపై భారత్ నజర్

- క్షిపణుల తయారీలోకి ప్రైవేట్ కంపెనీలు
- ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు
- యుద్ధ సమయంలో ఉత్పత్తికి ప్రత్యామ్నాయం
- డీఆర్‌డీవో టెక్నాలజీ బదిలీకి అనుమతి
- సరఫరా సమయం మెరుగుపడొచ్చని నివేదిక

యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. తరువాయి 2లో

## స్పామ్ కాల్స్‌కు చెక్

# రంగంలోకి 'ట్రాయ్'!

- ఫిర్యాదు లేకున్నా ఏఐ సాయంతో స్పామర్లను గుర్తించనున్న టెల్కోలు
- తొలిసారి పట్టుబడితే 15 రోజులు ఔట్‌గోయింగ్ కాల్స్ నిలిపివేత
- పదేపదే చేస్తే ఏడాది పాటు బ్లాక్‌లిస్ట్, కొత్త కనెక్షన్ బంద్

అనవసర స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారులకు ఊరటనిచ్చేలా టెలికాం తరువాయి 2లో

TRAI



## రైల్వే అలర్ట్:

# ప్రయాణానికి ఈ ఐడీలు ఉండాల్సిందే!

- అక్టోబర్ 1 నుంచి 31 వరకు రైల్వే స్పెషల్ టికెట్ తనిఖీ డ్రైవ్
- రాయితీ, కోటా, గ్రూప్ టికెట్లపై ప్రత్యేకంగా దృష్టి
- ప్రయాణ సమయంలో ఒరిజినల్ ఐడీ కార్డు తప్పనిసరి
- సరైన పత్రాలు లేకుంటే కనీస జరిమానా రూ.500

రైల్వే ప్రయాణికులకు ముఖ్య గమనిక. అక్రమ, అనధికార ప్రయాణాలకు అడ్డుకట్ట వేసేందుకు సెంట్రల్ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు ప్రత్యేక టికెట్ తనిఖీ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ తనిఖీలు రైల్వే స్టేషన్లతో పాటు లోకల్ రైళ్లలోనూ విస్తృతంగా కొనసాగనున్నా తరువాయి 2లో

ప్రైవేట్ పరం కానున్న

## తిరుపతి విమానాశ్రయం

- 11 విమానాశ్రయాల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- తమిళనాడులోని తిరుచ్చితో తిరుపతి ఎయిర్‌పోర్ట్ బండ్లింగ్
- పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు నిర్వహణ బాధ్యతలు




2లో

## ఉగ్రవాదంపై రాజీపడం

# అమెరికాకు జైశంకర్ స్పష్టీకరణ

- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి
- భారత్-అమెరికా బంధానికి వాణిజ్య విభేదాలతో పాటు ఉగ్రవాదం కూడా సవాల్ అని వ్యాఖ్య



భారత్‌అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని తరువాయి 2లో

పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..



# పల్లె పండుగ 3.0: పల్లెలకు రూ.11,085 కోట్లు

రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ 3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

**గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు**

'పల్లె పండుగ 3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది," అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

*** పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.



**ఉదయగిరికి వరాల జల్లు**

* ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.
* 65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.
* 90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్ 1 భూసేకరణకు రూ.85 కోట్లు.
* రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.
* కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.
* వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్ 2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం**

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రైతు బజార్లలో రూ. 35కే కిలో ఉల్లి

సామాన్యులకు ఊరటనిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ఉల్లి ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలను రూ. 35కే సబ్సిడీ ధరతో విక్రయించనున్నారు. తొలిదశలో భాగంగా రేపటి (సెప్టెంబర్ 30) నుంచి విజయవాడలోని అన్ని రైతు బజార్లలో ఈ విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ విక్రయాల కోసం ఆధార్ లేదా రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు 2 కిలోల వరకు సబ్సిడీ ఉల్లిపాయలు అందజేస్తారు. సామాన్యులపై పెరుగుతున్న ఉల్లి ధరల భారాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. విజయవాడలో లభించే స్పందన, డిమాండ్‌ను బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లకు ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. మార్కెట్‌లో ఉల్లి ధరలు అదుపులోకి వచ్చే వరకు ఈ సబ్సిడీ విక్రయాలను కొనసాగించాలని అధికారులు యోచిస్తున్నారు.

# సైబర్ మోసాల్లో కొత్త కోణం.. ఉన్నత విద్యావంతులే టార్గెట్!

సైబర్ ఆర్థిక మోసాల బారిన కేవలం నిరక్షరాస్యులు, అవగాహన లేని వారు మాత్రమే పడతారనే అపోహను ఐఐటీ మద్రాస్ తాజా అధ్యయనం పటాపంచలు చేసింది. ఉన్నత విద్యావంతులు, డిజిటల్ పరిజ్ఞానం కలిగిన ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో ఈ మోసాలకు గురవుతున్నారని ఈ పరిశోధన స్పష్టం చేసింది. కేవలం డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండటం ఒక్కటే సైబర్ నేరాల నుంచి పూర్తి రక్షణ కల్పించలేదని ఈ నివేదిక తేల్చి చెప్పింది. ఐఐటీ మద్రాస్‌కు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి, ప్రొఫెసర్ పి. కందస్వామి, ప్రొఫెసర్ నందన్ సుదర్శనం నేతృత్వంలో ఈ అధ్యయనం సాగింది. ఇందుకోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లోని బాధితులపై సర్వే నిర్వహించారు. బాధితుల్లో ఐటీ నిపుణులు, బ్యాంకు ఉద్యోగులు, వైద్యులు, ఆర్థిక రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో పాటు సైబర్ సెక్యూరిటీ ధ్రువీకరణ పత్రాలు కలిగిన వారు సైతం ఉండటం గమనార్హం. సైబర్ నేరగాళ్లు బాధితులను ఎంచుకోవడంలో ప్రత్యేక వ్యూహాలను అనుసరిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా కుటుంబంలో అనారోగ్య సమస్యలు, ఉద్యోగ వేట, పదవీ విరమణ, పని ఒత్తిడి వంటి కారణాలతో మానసిక ఆందోళనకు గురవుతున్న వారిని వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. భయం, ఆత్మన్యూనత వంటి భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని, వారిని మానసికంగా లొంగదీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మోసాల కారణంగా బాధితులు కేవలం ఆర్థికంగానే కాక, తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. అవమాన భారంతో కుంగిపోవడం, నిద్రలేమి, డిప్రెషన్, కుటుంబ సభ్యుల నమ్మకాన్ని కోల్పోవడం వంటి పరిణామాలు వారిని వేధిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు, సైబర్ క్రైమ్ విభాగాలు సత్వరమే స్పందిస్తున్నప్పటికీ, మరికొన్ని విభాగాలు సాంకేతిక సామర్థ్యం లోపం కారణంగా వెనుకబడుతున్నాయని ఈ అధ్యయనం గుర్తించింది. ఈ నేపథ్యంలో, నివారణ వ్యూహాలను రూపొందించేటప్పుడు ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# ప్రైవేట్ పరం కానున్న తిరుపతి విమానాశ్రయం

దేశంలోని 11 విమానాశ్రయాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి విమానాశ్రయాన్ని తమిళనాడులోని తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంతో కలిపి (బండ్లింగ్) ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (EoI) జారీ చేసింది. పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఈ విమానాశ్రయాల నిర్వహణ, అభివృద్ధి, ఆధునికీకరణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలు చూసుకుంటాయి. ఈసారి కేంద్రం తొలిసారిగా బండ్లింగ్ విధానాన్ని అనుసరిస్తోంది. వాణిజ్యపరంగా లాభదాయకతను పెంచేందుకు, తక్కువ రద్దీ ఉన్న విమానాశ్రయాన్ని, రద్దీగా ఉండే విమానాశ్రయంతో జత చేస్తున్నారు. ఈ 11 విమానాశ్రయాల అభివృద్ధికి ప్రైవేటు సంస్థల నుంచి సుమారు రూ. 8,622 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. విమానాశ్రయాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, నాన్‌ఏరోనాటికల్ ఆదాయాన్ని (రిటైల్, కార్గో) పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. తిరుమల యాత్రికులు, పర్యాటకుల రాకపోకలతో తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి నగరాలకు రోజువారీ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. భవిష్యత్తులో ప్రయాణికుల సంఖ్య పెరిగాక రాజమండ్రి, కడప విమానాశ్రయాలను కూడా ఇదే తరహాలో ప్రైవేటీకరించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. లీజు ఒప్పందంలో భాగంగా, ప్రైవేటు సంస్థలు మొదటి మూడేళ్లపాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ సిబ్బందిలో 60 శాతం మందిని కొనసాగించాల్సి ఉంటుంది. విమానాశ్రయాల యాజమాన్యం AAI వద్దే ఉండగా, నిర్వహణ బాధ్యతలు మాత్రమే ప్రైవేటు సంస్థలకు బదిలీ అవుతాయి. ఈ ప్రక్రియ ఇప్పుడు బిడ్డింగ్ దశకు చేరుకుంది.

# రైల్వే అలర్ట్: ప్రయాణానికి ఈ ఐడీలు ఉండాల్సిందే!

రైల్వే ప్రయాణికులకు ముఖ్య గమనిక. అక్రమ, అనధికార ప్రయాణాలకు అడ్డుకట్ట వేసేందుకు సెంట్రల్ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు ప్రత్యేక టికెట్ తనిఖీ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ తనిఖీలు రైల్వే స్టేషన్లతో పాటు లోకల్ రైళ్లలోనూ విస్తృతంగా కొనసాగనున్నాయి. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా రాయితీ టికెట్లు, నిర్దేశిత రిజర్వేషన్ కోటాలు, రైల్వే పాస్‌లు (ఈపాస్, పీటీవో), గ్రూప్ బుకింగ్‌లు, అన్‌రిజర్వ్‌డ్ టికెట్లపై అధికారులు ప్రధానంగా దృష్టిసారించనున్నారు. తనిఖీ సిబ్బంది 'టీటీఈ యాప్' ద్వారా కూడా టికెట్ల ప్రామాణికతను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. రాయితీ లేదా ప్రత్యేక కోటాల కింద ప్రయాణించే వారు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డును తమ వెంట ఉంచుకోవాలని రైల్వే స్పష్టం చేసింది. గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలు లేదా మొబైల్ ఫోన్‌లోని ఫోటోలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తేల్చిచెప్పింది. ప్రయాణికులు తమ వెంట ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా ప్రభుత్వం జారీ చేసిన ఇతర గుర్తింపు కార్డులను చూపించవచ్చు. గ్రూప్ రిజర్వేషన్ చేసుకున్న సందర్భంలో, టికెట్‌పై పేరు ఉన్న ప్రయాణికులలో కనీసం ఒక్కరైనా ఒరిజినల్ ఐడీ కార్డును చూపించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో, గ్రూప్‌లోని ప్రయాణికులందరినీ టికెట్ లేని వారిగానే పరిగణిస్తారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు చూపించలేకపోయినా, టికెట్ అర్హతను నిరూపించుకోలేకపోయినా రైల్వే నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటారు. టికెట్ లేకుండా ప్రయాణించినందుకు విధించే కనీస జరిమానాను ఇటీవల రూ. 250 నుంచి రూ. 500కి పెంచినట్లు రైల్వే గుర్తు చేసింది. ప్రయాణికులు నిబంధనలు పాటించి, తనిఖీ సిబ్బందికి సహకరించి తమ ప్రయాణాన్ని సులభతరం చేసుకోవాలని సెంట్రల్ రైల్వే విజ్ఞప్తి చేసింది.

# స్పామ్ కాల్స్‌కు చెక్.. రంగంలోకి 'ట్రాయ్'!

అనవసర స్పామ్ కాల్స్‌తో విసిగిపోతున్న మొబైల్ వినియోగదారులకు ఊరటనిచ్చేలా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందకపోయినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత సాయంతో స్పామ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయాలని టెలికాం సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు 'టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్'లో నూతన నిబంధనలను పొందుపరిచింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, టెలికాం కంపెనీలు తమ ఏఐ లేదా మెషీన్ లెర్నింగ్ వ్యవస్థల ద్వారా ఏదైనా కాల్‌ను స్పామ్‌గా గుర్తిస్తే, ఆ సమాచారాన్ని రెండు గంటల్లోపు సంబంధిత ఆపరేటర్‌కు నివేదించాలి. సదరు ఆపరేటర్ ఒక పనిదినం వ్యవధిలో ఆ నంబర్‌కు సంబంధించిన కేవైసీ వివరాలను సేకరించి, ఇతర టెలికాం సంస్థలతో పంచుకోవాల్సి ఉంటుంది. గడిచిన 10 రోజుల్లో ఒకే వ్యక్తి లేదా సంస్థకు చెందిన ఐదు కంటే ఎక్కువ నంబర్లు స్పామ్‌గా నమోదైతే, అన్ని టెలికాం సంస్థలు సమన్వయంతో కఠిన చర్యలు చేపడతాయి. స్పామర్లపై కఠిన చర్యలను కూడా ట్రాయ్ ప్రతిపాదించింది. ఏఐ విశ్లేషణలో మొదటిసారి స్పామర్‌గా నిర్ధారణ అయితే, సదరు వ్యక్తి పేరిట ఉన్న అన్ని కనెక్షన్లపై 15 రోజుల పాటు అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేస్తారు. నిబంధనలను అతిక్రమిస్తూ మళ్లీ అదే తప్పు చేస్తే, ఆ నంబర్లను ఏడాది పాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతారు. అటువంటి వారికి ఏ టెలికాం సంస్థ కూడా కొత్త కనెక్షన్‌లను జారీ చేయదు. వినియోగదారుల సౌలభ్యం కోసం మరికొన్ని మార్పులను కూడా ట్రాయ్ సూచించింది. ఇకపై కేవలం ప్రమోషనల్ కాల్స్‌ను మాత్రమే నిలిపివేయాలనుకునే వారు, తమ మొబైల్ నుంచి 'BLOCK PROMO' అని టైప్ చేసి 1909 నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపితే సరిపోతుంది. ఇప్పటికే 'FULLY BLOCK' సేవను పొందుతున్న వినియోగదారులను 15 రోజుల్లోగా నూతన కేటగిరీకి మారుస్తామని ట్రాయ్ వెల్లడించింది. కాగా, ప్రభుత్వం, బ్యాంకులు, అధీకృత సంస్థల నంబర్లను ట్రూకాలర్ వంటి యాప్‌లు స్పామ్‌గా ట్యాగ్ చేయడాన్ని ట్రాయ్ నిషేధించింది.

# యుద్ధ సన్నద్ధత: క్షిపణుల నిల్వపై భారత్ నజర్

యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది.

**ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీ**

ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్ కమ్ ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు.

**పోటీతో ధరలు, డెలివరీపై ప్రభావం**

ఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది.

**యుద్ధ సమయంలో ఉత్పత్తే కీలకం**

దీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.

ఇక పోటీ తప్పనిసరి

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

# ఉగ్రవాదంపై రాజీపడం: అమెరికాకు జైశంకర్ స్పష్టీకరణ

భారత్‌అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్‌అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారత్‌అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.

## సంపాదకీయం

# జగన్ త్రిముఖ వ్యూహం
# ఉనికిని కాపాడుతుందా? ముంచుతుందా?

వైసీపీ ప్రభుత్వానికి సహకరించిన అధికారులకు మానసిక వ్యాధులు వస్తే, నేతలకు గుండెకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయి. గుండె జబ్బులు కట్టకట్టుకుని వైసీపీ పార్టీ ఆఫీసులో తిష్ట వేసుకున్నట్లుగా ఉన్నాయి. ఎవరికైనా విచారణకు రమ్మని నోటీసులు వస్తే, వైసీపీ ఆఫీస్ నుండి గుండె జబ్బు టోకెన్ ఇస్తున్నట్లున్నారు. "జైల్లో ఉంటే దోమలు కుట్టక రంభ, ఊర్వశులు వస్తారా?" అని వ్యంగ్యోక్తులు విసిరిన వారు, జైలుకు వెళ్లకుండా ఉండే ప్రయత్నాల్లో రోగాలను బాహాటంగా ప్రదర్శిస్తున్నారు. ఇక "అరెస్ట్ చేసే దమ్ము ఉంటే రండి" అని సవాళ్లు విసిరిన వారు నోటీసులు రాగానే గుండెకు స్టంట్ల రాగం వినిపిస్తున్నారు. పొలిటికల్ క్లాసులు నిర్వహించి జబ్బులు ఎప్పుడు రప్పించుకోవాలో, మెడికల్ సర్టిఫికెట్లు ఎలా పుట్టించుకోవాలో ట్రైనింగ్ ఇచ్చినట్లున్నారు. మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు అందగానే అంబటి రాంబాబు ఒకసారి నోటీసులు అందలేదు అని చెప్పారు. మొదటి నోటీసు అందలేదు అని చెప్పి, రెండో నోటీసు అందే సమయానికి గుండెకు స్టంట్లు వేయించుకున్నారు. పూర్తిగా కోలుకున్నాక విచారణకు సహకరిస్తాను అంటూ ఈడీకి బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు. ఎప్పటికి కోలుకుంటారు అనేది ఈడీ తీసుకునే తదుపరి చర్యలను బట్టి ఉంటుంది. కాకపోతే మొన్నటివరకు పోలీసులకు సవాళ్లు విసిరిన అంబటి, ఈడీ పిలవగానే భయంతో గుండెనొప్పి తెచ్చుకున్నారు అంటున్నారు. ఇవే నోటీసులు మద్యం స్కాంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్' ఇచ్చివుంటే, అంబటి రాంబాబు లాంటివాళ్లు రాజకీయ కక్షతో ఇచ్చిన నోటీసులు అంటూ అదే పనిగా ప్రచారం చేసుకునే వారు. ఇప్పుడు గట్టిగా అనే పరిస్థితి లేదు. కాకపోతే ఈడీ కూడా సాక్షుల వాంగ్మూలాన్ని బట్టి అందరికీ నోటీసులు ఇస్తుందా అంటే అనుమానమే. ఢిల్లీ మద్యం కుంభకోణంలో చేసిన ఆరోపణల మొత్తం సొమ్ము, ఏపీ మద్యం స్కాములో, రవాణా స్కాములో ఉన్నదానికంటే తక్కువ. కానీ ఢిల్లీ స్కాములో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ప్రవేశించగానే ఈడీ కూడా ప్రవేశించింది. రెండు స్వతంత్ర సంస్థలు శరవేగంగా విచారణలు, అరెస్టులు మొదలుపెట్టాయి. అప్రూవర్ల సాక్ష్యం ఆధారంగా ఆమ్ ఆద్మీ పార్టీని ఒక కంపెనీగా గుర్తించి ముఖ్యమంత్రిని కూడా అరెస్ట్ చేశారు. మరి ఆ వేగం జగన్ విషయంలో కనిపించటం లేదు. జగన్ చుట్టూ సమస్యలు సృష్టిస్తున్నారు తప్పితే, జగన్ జోలికి మాత్రం వెళ్లటం లేదు. ఇప్పుడు బీజేపీకి టీడీపీ మద్దతే అవసరం లేదు; ఇక జగన్ మోహన్ రెడ్డి అవసరం అంతకన్నా లేదు. కానీ బీజేపీ ఎవరినీ వదులుకోదు. అయితే, సీఈసీ వ్యవహారంలో జగన్ హద్దులు దాటారు; మమతా బెనర్జీ స్థాయిలో విమర్శ చేశారు. 'ఇండియా టుడే' చెప్పిన సర్వే బీజేపీకి కొద్దిగా చికాకు పెడుతున్నది. అయితే ఇండియా టుడే చేసిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' ఫలితాలు భారతీయ జనతా పార్టీ కంటే జగన్ మోహన్ రెడ్డిని ఎక్కువ కలవరపరచినట్లు ఉన్నది. మొట్టమొదటిసారి బీజేపీని బాహాటంగా విమర్శించారు. ఈసీలో విభేదాలు వచ్చినట్లు వచ్చిన కథనాలపై స్పష్టత ఇవ్వాలని, ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇంతకంటే మించి 2023 ఈసీ నియామకాల చట్టాన్ని పునఃసమీక్ష చేయాలని డిమాండ్ చేయటం చాలా పెద్ద విషయం. 2023 లో తీసుకొచ్చిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకాల చట్టానికి అప్పట్లో తమ పార్టీ మద్దతు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ చట్టాన్ని మరోసారి సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. చివరకు "విద్యార్థే పరీక్ష పెట్టే వారిని నియమించేలా ఉంటే అనుమానాలు వస్తాయి" అని అంటూ, గతంలో మాదిరి భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారానే నియామకాలు జరగాలని పేర్కొన్నారు. అంటే మోదీ ప్రభుత్వం చేసే విధానం తప్పు అని చెప్పారు. "చంద్రబాబు నాయుడు కంటే జగన్ నమ్మకస్తుడైన స్నేహితుడు" అని అమిత్ షా ఎవరితోనో చెప్పాడని ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రచారం చేసిన రోజు ఏమాత్రం పట్టించుకోని రెండు తెలుగు రాష్ట్రాల భారతీయ జనతా పార్టీ నాయకులకు ఇది కోలుకోలేని దెబ్బ. జగన్ మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ వెనుక స్ట్రాటజీ ఏమిటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. జగన్ మోహన్ రెడ్డి 'ఇండియా' కూటమి వైపు మొగ్గు చూపుతున్నాడా అనే సందేహాన్ని వెలిబుచ్చుతున్నారు. తెలిసి చేస్తున్నాడో తెలియక చేస్తున్నాడో కానీ జగన్ ఇప్పుడు త్రిముఖ వ్యూహం అమలు చేస్తున్నాడు. రాష్ట్రంలో ఆందోళనల పేరుతో అరాచకం సృష్టించగలుగుతున్నాడు; మరోవైపు జాతీయ రాజకీయాలలో వేలు పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు; రాష్ట్ర ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులను ఆపే ప్రయత్నం చేస్తున్నాడు. ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ప్రస్తుతం జగన్ ఉన్న పరిస్థితుల్లో తానే ఉక్కిరిబిక్కిరి అవ్వాలి. తన పాత కేసులు విచారణకు వచ్చే అవకాశం ఉన్నదని జగన్‌కు అర్థమవుతున్నది. వివేకా హత్య కేసులో ఈడీ వేలు పెట్టి విచారణ పేరుతో హడావుడి చేస్తున్నది. మద్యం స్కాంలో తన గట్టి మద్దతుదారులు అందరూ ఇరుక్కుని అరెస్టులు అవుతున్నారు. ఇంట్లో ఆస్తుల వివాదాలు. టీటీడీలో కల్తీ నెయ్యి కేసు కూడా జగన్ ప్రమేయం ఉన్నట్లుగా ప్రజలు భావించే దిశగా విచారణ జరుగుతున్నది. తాను, తన చిన్నాన్న బయటపడి ఉండవచ్చు కానీ, తన ప్రభుత్వ హయాంలో జరిగింది అని రుజువయ్యే దిశగా సాగుతున్నది. మధ్యమధ్యలో ఏదో ఒక సందర్భం సృష్టించుకుని బలప్రదర్శన చేస్తూ ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టటంలో కొంతమేర సఫలీకృతుడయ్యాడనే చెప్పాలి. డీఎస్సీ అయిపోయిన సంవత్సరం తరువాత కొత్త విషయం మాదిరిగా, అది కూడా న్యాయస్థానాలే కొట్టివేసిన ఆందోళన చేయటంలో సఫలమయ్యాడు. వచ్చిన వాళ్లల్లో రెండు వందల కంటే ఎక్కువ మంది రౌడీ షీటర్లే ఉన్నారు అని ప్రభుత్వం చెబుతున్నది. అంతమంది రౌడీ షీటర్లను విజయవాడ నడిబొడ్డుకు తరలించగలగటం జగన్ విజయమో, వారి కదలికలను ముందే పసిగట్టి నిలువరించలేకపోవటం కూటమి వైఫల్యమో తెలియదు. అభివృద్ధిని అడ్డుకోవటంలో కూడా పెట్టుబడిదారులకు కొంత భయాన్ని కలిగించగలిగాడు. కాకపోతే ఈ రెండు విజయాలు ప్రభుత్వాన్ని తాత్కాలికంగా ఇబ్బంది పెట్టవచ్చు కానీ, జగన్‌కు ఓటు బ్యాంకుగా మారే అవకాశమే లేదు. ఒక రకంగా బీజేపీని కూడా ఇరుకున పెట్టినట్లే లెక్క. ఇప్పుడు బీజేపీ శత్రుసైన్యం అంతా కేంద్ర ప్రభుత్వాన్ని చుట్టుముడుతున్న వేళ, ఎప్పుడూ గళం విప్పని తాను కూడా గొంతు కలపటం మేలు చేస్తుందా కీడు చేస్తుందా అంటే చెప్పటం కష్టం. తన ప్రభ కూడా తగ్గిపోతున్న వేళ బీజేపీ చంద్రబాబు నాయుడుకు చేసినంత దురాగతం జగన్‌కు చేసే ధైర్యం చేయకపోవచ్చు. పొరపాటున 2029 లో కూడా కేంద్రంలో బీజేపీ సర్కారే వస్తే మాత్రం ఈరోజు జగన్ మోహన్ రెడ్డి పెట్టిన ఈ చిన్న ట్వీట్ కూడా ప్రభావం చూపిస్తుంది. అయితే మొండిగా ముందుకు వెళ్లే జగన్ నైజం గతంలో ఉపయోగపడినంతగా భవిష్యత్తులో ఉపయోగపడే పరిస్థితులు కనిపించటం లేదు. చంద్రబాబు నాయుడిని టార్గెట్ చేయటమే పనిగా చేసే జగన్ రాజకీయం ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్‌లో జగన్ ఉనికికే ప్రమాదం తెచ్చిపెడుతుంది.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 30

* అంతర్జాతీయ అనువాద దినోత్సవం.
* 1207: పర్షియన్ కవి, ఇస్లామీయ న్యాయతత్వవాది, ధార్మికవేత్త, సూఫీ జలాలుద్దీన్ ముహమ్మద్ రూమి జననం (మ.1273).
* 1828: భారత యోగీశ్వరుడు, మహావతార్ బాబాజీ కి శిష్యుడు లాహిరి మహాశయులు జననం (మ.1895).(చిత్రంలో)
* 1955: అమెరికాకు చెందిన నటుడు జేమ్స్ డీన్ మరణం (జ.1931).
* 1961: భారతదేశపు మాజీ క్రికెట్ క్రీడాకారుడు చంద్రకాంత్ పండిత్ జననం.
* 1964: ఇటలీ నటి, ఫ్యాషన్ మోడల్ మోనికా బెల్లూచి జననం.
* 1971: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పి.వి. నరసింహారావు పదవీస్వీకారం చేశాడు.
* 1980: మాజీ టెన్నిస్ క్రీడాకారిణి మార్టినా హింగిస్ జననం.
* 1990: కన్నడ సినిమాలో పాపులర్ నటుడు, దర్శకుడు. సుప్రసిద్ధ నవలా రచయిత శంకర్ నాగ్ మరణం (జ.1954).


లాహిరి మహాశయులు

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు

* ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో సింగపూర్ హోం మంత్రి షణ్ముగం భేటీ
* రాష్ట్రంలో విద్యా సంస్కరణలను ప్రశంసించిన సింగపూర్ మంత్రి
* మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యారంగంలో ఏపీకి సహకారం అందిస్తామని హామీ
* ఏపీ ఐటీఐలను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించాలని నిర్ణయం
* డ్రాపౌట్లను సున్నా శాతానికి తగ్గించాలని షణ్ముగం సూచన



ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.



## ఉద్యోగులు నైపుణ్యాలను పెంచుకోవాలి: సీఎం చంద్రబాబు

విజయవాడ: దేశ భవిష్యత్తు కోసం ఉద్యోగులు నైపుణ్యాలను పెంచుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు (Chandrababu) పిలుపునిచ్చారు. రానున్న 20 ఏళ్లలో భారత్ అగ్రస్థానానికి ఎదగాలంటే యువత ఆకాంక్షలకు అనుగుణంగా పాలనా వ్యవస్థలు పనిచేయాలన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ కళావేదికలో నిర్వహించిన 'మిషన్ కర్మయోగి' దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వర్క్‌షాప్‌ను సీఎం ప్రారంభించి మాట్లాడారు. రియల్‌టైమ్ గవర్నెన్స్, డేటా లేక్, ఈఫైలింగ్ వంటి వ్యవస్థలతో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చంద్రబాబు చెప్పారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయికి సూచనలు జారీ చేస్తున్నామన్నారు. ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో కోర్సులు పూర్తి చేసి ఏపీని అగ్రస్థానంలో నిలిపిన ప్రభుత్వ యంత్రాంగాన్ని సీఎం అభినందించారు. ప్రజాసేవల నాణ్యత పెరగాలంటే టెక్నాలజీ, విధానాలను అనుసంధానిస్తూ.. శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడితో పనిచేయాలని సూచించారు. సంక్షోభంగా మారకముందే సమస్యలను గుర్తించి పరిష్కరించే నైపుణ్యాలు పెంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నలందా విద్యార్థులతో ఉల్లాసంగా... ఉత్సాహంగా "మారథాన్

విజయవాడ: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సెంటినీ హాస్పిటల్స్‌కు చెందిన సెంటినీ డా. శ్రీమాన్ హాస్పిటల్, డైరెక్టర్ మరియు ప్రముఖ చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ముఖ్య అతిథి గా పాల్గొని నలందా విద్యార్థులతో కలిసి మారథాన్ కార్యక్రమాన్ని ఉల్లాసంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, గుండె సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ముఖ్య అతిథి గా పాల్గొన్న డాక్టర్ జె.శ్రీమన్నారాయణ






మాట్లాడుతూ, "గుండె ఆరోగ్యం ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో గుండె సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చు" అని తెలిపారు. కిలోమీటర్ సాగిన ఈ మారథాన్ లో నలందా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని "హృదయాన్ని కాపాడుకుందాం - ఆరోగ్యంగా జీవిద్దాం", "గుండె ఆరోగ్యం - మనందరి బాధ్యత" వంటి సందేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్యంపై చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలో గుండె ఆరోగ్యంపై అవగాహనకు దోహద పడుతుందని తెలిపారు. నలంద కళాశాల ప్రిన్సిపాల్ మాదాల పద్మజ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసుపై
# సుప్రీంకోర్టు జోక్యాన్ని స్వాగతిస్తున్నాం

సోహ్రాబుద్దీన్ షేక్‌తో పాటు ఆయన భార్య కౌసర్ బీ, ఆయన సన్నిహితుడు తులసీరాం ప్రజాపతి వరుసగా జరిగిన ఆరోపిత ఎన్‌కౌంటర్ హత్యల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసును విచారిస్తున్న జస్టిస్ బి.హెచ్. లోయా మరణం కూడా అప్పట్లో తీవ్ర ప్రజా వివాదానికి దారితీసింది. అప్పటి గుజరాత్ హోంమంత్రి, ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ కేసులో నిందితుడిగా ఉన్నారు. అనంతరం ఆయన



డిశ్చార్జ్ అయ్యారు. అమిత్ షా డిశ్చార్జ్‌కు సంబంధించిన న్యాయ ప్రక్రియ, జస్టిస్ లోయా మరణానికి సంబంధించిన పరిస్థితులు, అలాగే ఇతర నిందితులకు సంబంధించిన కేసులను కూడా చట్టపరంగా సాధ్యమైన పరిధిలో సమగ్రంగా పరిశీలించాలని సుప్రీంకోర్టును కోరుతున్నాం. ఈ కేసుల సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, విచారణ చేపడుతున్న న్యాయమూర్తులకు ప్రత్యేక భద్రత, రక్షణ కల్పించాలి. వారు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా రాజ్యాంగబద్ధమైన విధులను స్వతంత్రంగా నిర్వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**- కే. నారాయణ, సీపీఐ**

# గుండె విషయంలో ఒక్క క్షణం కూడా నిర్లక్ష్యం చేయొద్దు

విజయవాడ : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా - ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ప్రతి ఒక్కరూ తమ గుండె ఆరోగ్యాన్ని జీవితాంతం కాపాడుకోవాలని మంగళవారం నాడు సూర్యారావుపేటలోని కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో అధికార ప్రతినిధి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. ఎ.పూర్ణానంద్ తెలిపారు. "ఒక్క క్షణం కూడా నిర్లక్ష్యం చెయ్యొద్దు" అనే సందేశంతో గుండె జబ్బుల నివారణ, ప్రమాద కారకాలపై అవగాహన, హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స పొందడం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరాన్ని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎ.పి. చాప్టర్ వివరించింది. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, పొగాకు మరియు ధూమపానానికి పూర్తిగా దూరంగా ఉండటం, తగినంత నిద్ర పొందడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రతి ఒక్కరూ పాటించాలని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎ.పి. అధ్యక్షులు డా. కె. గోపాల కృష్ణ సూచించారు. గుండె ఆరోగ్యం కేవలం శారీరక ఆరోగ్యానికే పరిమితం కాదని, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎ.పి. తెలిపింది. పని, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత, తగిన విశ్రాంతి, కుటుంబం మరియు స్నేహితులతో ఆరోగ్యకరమైన సంబంధాలు, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలు మొత్తం ఆరోగ్యానికి దోహదపడతాయి. యోగా, ధ్యానం వంటి పద్ధతులు క్రమబద్ధమైన శారీరక వ్యాయామం మరియు ఇతర నివారణ చర్యలకు తోడ్పడతాయని చెప్పారు. విలేఖరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, కొలెస్ట్రాల్, శరీర బరువు వంటి అంశాలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సూచించింది. అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని పేర్కొన్నారు. ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి, అకస్మాత్తుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కారణం తెలియని చెమటలు, గుండె దడ, స్పృహ కోల్పోవడం లేదా అకస్మాత్తుగా బలహీనత వంటి లక్షణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. గుండెపోటు సమయంలో ప్రతి నిమిషం ఎంతో విలువైనది. రక్తప్రసరణను ఎంత త్వరగా పునరుద్ధరిస్తే అంత ఎక్కువ గుండె కండరాన్ని కాపాడే అవకాశం ఉంటుంది. గుండెపోటు అనుమానం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలని, గుండెపోటుకు తగిన చికిత్స అందించే ఆసుపత్రికి వీలైనంత త్వరగా చేరాలని సూచించారు. "గోల్డెన్ అవర్"ను కోల్పోవద్దు : ఇప్పటికే గుండె సంబంధిత వ్యాధులతో జీవిస్తున్న వారు తమ ఆరోగ్యాన్ని మరింత జాగ్రత్తగా కాపాడుకోవాలని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎ.పి. సూచించింది. యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ లేదా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్‌తో చికిత్స పూర్తవదని, తదుపరి నివారణ చర్యలు జీవితాంతం కొనసాగాల్సి ఉంటాయని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎ.పి.అధ్యక్షురాలు డాక్టర్ వి.వనజాక్షమ్మ తెలిపారు. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవడం, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం, పొగాకు వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయడం, గుండెకు అనుకూలమైన ఆహారం తీసుకోవడం, వైద్యుల సలహా మేరకు శారీరక




చురుకుదనం కొనసాగించడం, అవసరమైతే కార్డియాక్ రిహాబిలిటేషన్‌లో పాల్గొనడం, క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొంది.

*** ఆరోగ్యవంతమైన భారతదేశమే వికసిత భారతదేశానికి పునాది**

భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే, అదే సమయంలో ఆరోగ్యవంతమైన దేశంగా కూడా ఎదగాల్సిన అవసరం ఉందని కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎ.పి. విభాగం పేర్కొంది. గుండె జబ్బుల భారాన్ని తగ్గించేందుకు నివారణ, ప్రజల్లో అవగాహన, ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్స, శాస్త్రీయ ఆవిష్కరణలు, మానవీయమైన వైద్య సేవలు కీలకమని తెలిపింది. ప్రతి కుటుంబంలో గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తూ, భారతదేశాన్ని ఆరోగ్య రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిపే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్ర ప్రదేశ్ కార్డియాలజికల్ సొసైటీ పిలుపునిచ్చింది. ఈ విలేఖరుల సమావేశం లో డా. శ్యామ్ ప్రసాద్, డా. చైతన్య తదితరులు పాల్గొని పోస్టర్ ను ఆవిష్కరించారు.



## బంగారం లాక్కొని మహిళను గోదావరిలోకి
# తోసేసిన ఆటో డ్రైవర్

తాళ్లపూడి: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలను ఆటో డ్రైవర్ లాక్కొని.. ఆమెను గోదావరి నదిలోకి తోసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్త పట్టిసీమకు చెందిన వింటే ఆదిలక్ష్మి (36)కి గోపాలపురం మండలం భీమోలుకు చెందిన సత్తిబాబుతో సుమారు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఏడేళ్ల కిందట భర్త పాముకాటుతో మృతి చెందటంతో కొత్తపట్టిసీమలోని పుట్టింటికి వచ్చేసింది. ఆమె కుమార్తె హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఆదిలక్ష్మి తల్లిదండ్రుల వద్దే ఉంటూ ఉపాధి నిమిత్తం తాళ్లపూడిలోని ఓ స్వీటు దుకాణంలో ఏడాది కాలంగా పనిచేస్తోంది. గ్రామానికి చెందిన కొందరు కూడా అదే దుకాణంలో పనిచేస్తూ నిత్యం ఆర్టీసీ, ఆటోల మీద ప్రయాణం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే ఆదిలక్ష్మి సోమవారం దుకాణంలో పనిచేయడానికి వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెతో పనిచేసే వారిని ఆరా తీశారు. ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం తాళ్లపూడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆదిలక్ష్మి అన్నయ్య సత్యనారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

**సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు**

పోలీసులు కొవ్వూరు గ్రామీణ సీఐ విజయబాబు పర్యవేక్షణలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆ మహిళ పనిచేసే దుకాణం పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. సోమవారం రాత్రి తాడిపూడికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ యాకబ్ ఆటోలో ఆదిలక్ష్మి ఒక్కరే ఎక్కినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిసింది. తాళ్లపూడి నుంచి కొత్తపట్టిసీమ వెళ్లే క్రమంలో డ్రైవర్ ఆమె మెడలో ఉన్న సుమారు మూడు కాసుల బంగారు ఆభరణాలను లాక్కొని ఆమెను గోదావరి నదిలోకి తోసేసినట్లు సమాచారం. మహిళ మృతదేహం కోసం పోలీసులు గోదావరి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె మృతదేహం ఆచూకీ దొరికితే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో
# గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది: పవన్ కల్యాణ్

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

*** గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి**

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు



ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

*** రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'**

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

*** ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు**

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.



## విజయవాడలో భారీ మోసం..
# విశ్రాంత ఇంజినీర్‌కు రూ.10కోట్ల టోకరా

విజయవాడ: నగరంలో భారీ మోసం వెలుగు చూసింది. పోలీసుల పేరు చెప్పి విశ్రాంత ఇంజినీర్‌కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నాలుగు విడతల్లో రూ.10 కోట్లు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం విజయవాడ(Vijayawada) గురునానక్ కాలనీకి చెందిన ఓ విశ్రాంత ఇంజినీర్‌కు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబరు వివిధ నేరాల్లో తమకు లభించిందని, మీపై కేసులు ఉన్నాయని చెప్పారు. ఆ తర్వాత వీడియోకాల్ చేసి.. డిజిటల్ అరెస్టు చేసినట్టు బెదిరించారు. కేసుల నుంచి బయటపడాలంటే భారీగా డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో భయపడి పోయిన విశ్రాంత ఇంజినీర్.. సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు చేశారు. కృష్ణలంకలోని కెనరా బ్యాంకు ద్వారా నాలుగు లావాదేవీల్లో .. నిందితులు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి రూ.10 కోట్లు డిపాజిట్ చేశారు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు.. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. బాధితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా నిందితులకు సంబంధించిన రెండు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.7కోట్లు ఫ్రీజ్ చేశారు. విశ్రాంత ఇంజినీరు బ్యాంకులో తనకున్న ఫిక్స్‌డ్ డిపాట్ చేసిన నగదు తీసిమరీ సైబర్ నేరగాళ్లకు చెల్లించినట్టు సమాచారం.

# వివేకా హత్య కేసులో లబ్ధిదారుడు జగనే: మంత్రి అనగాని సత్యప్రసాద్

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అసలైన, అంతిమ లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి జగనేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈడీ, సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదులుతున్నాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ధర్నాల పేరిట డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. "సొంత బాబాయ్ గొడ్డలిపోటుకు గురైతే గుండెపోటుగా నమ్మించి, సాక్ష్యాలను తుడిచిపెట్టిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు కూడా అదే తరహాలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి, సునీల్ యాదవ్ వెల్లడించిన వాస్తవాలు, రూ.40 కోట్ల సుపారీ లావాదేవీలన్నీ తాడేపల్లి నివాసం వైపే వేలెత్తి చూపిస్తున్నాయి" అని అనగాని పేర్కొన్నారు. హత్య కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకోవడంతోనే డీఎస్పీ వంటి అంశాలపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయుడు కాకుమాను రాజశేఖర్‌ను ధర్నాకు బలవంతంగా పిలిపించి, ఆయన మృతికి కారకులయ్యారని, ఇప్పుడు ఆ మరణంపై కూడా శవ రాజకీయం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వమే రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సంస్కృతిని పెంచి పోషించిందని మండిపడ్డారు. తప్పులు చేస్తూ ఇతరులపై ఎదురుదాడికి దిగడం వైసీపీకి అలవాటుగా మారిందని, ఆ పార్టీ తన పేరును 'గొడ్డలి డైవర్షన్ పార్టీ'గా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జగన్ మీడియా ముందుకు వచ్చి వివేకా హత్యపై వాస్తవాలను వెల్లడించాలని అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరించి, వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# ఫిజికల్ స్టాకింగ్ కంటే సైబర్ స్టాకింగ్ ఎక్కువైంది: రాయపాటి శైలజ

తిరుపతి: ఒకప్పుడు ఫిజికల్ స్టాకింగ్ ఎక్కువగా ఉండేదని.. ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరగడంతో సైబర్ స్టాకింగ్ ఎక్కువవుతోందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ (Rayapati Sailaja) అన్నారు. సోషల్ మీడియా, ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారా మహిళలను ఇబ్బంది పెట్టడం, వెంటపడటం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి వాటిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయంలో 'స్టాకింగ్ నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా మరో నంబర్ నుంచి పదేపదే కాల్స్, మెసేజ్‌లు చేయడం కూడా స్టాకింగ్‌లో భాగమేనన్నారు. అనుమతి లేకుండా గిఫ్టులు, బొకేలు పంపడం, మహిళల డీపీలు, ఫొటోలతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, వ్యక్తిగత ఫొటోలు, సమాచారాన్ని దుర్వినియోగం చేసి వేధించడం వంటి చర్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుని నిరంతరం సంప్రదించడం, వెంటపడటం వంటి ఘటనలను తొలిదశలోనే గుర్తించాలని సూచించారు.

**మానసిక బలం కూడా అవసరం**




మహిళల భద్రతకు చట్టాలు, పోలీసు వ్యవస్థతో పాటు మానసిక బలం కూడా అవసరమని శైలజ అన్నారు. వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పాలని సూచించారు. 'సమాజం ఏమనుకుంటుందో.. బంధువులు ఏమంటారో' అనే ఆలోచనతో సమస్యను దాచిపెట్టకూడదన్నారు. సమస్యను ముందుగానే గుర్తించి ఫిర్యాదు చేస్తే మరింత తీవ్రం కాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.

**హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన**

181 మహిళా హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు, 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబర్లను మహిళలు గుర్తుంచుకోవాలని సూచించారు. శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. జీరో ఎఫ్ఐఆర్‌పై కూడా అవగాహన అవసరమన్నారు. ఫిర్యాదు సమయంలో అవసరమైతే మహిళా పోలీసు అధికారిని కోరే హక్కు ఉందని చెప్పారు. మెడికో విద్యార్థుల ఆత్మహత్యలు కలచివేస్తున్నాయి.. వరుసగా మెడికో విద్యార్థుల ఆత్మహత్యలు తీవ్రంగా కలచివేస్తున్నాయని శైలజ అన్నారు. శ్రావణి, శైలజ కుటుంబాలకు మహిళా కమిషన్ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలపై డీఎంఈతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. "విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని గుర్తించి సకాలంలో స్పందించాలి. మానసికంగా కుంగిపోయినప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు, అధ్యాపకులతో మాట్లాడాలి. అవసరమైనప్పుడు నిపుణుల సాయం తీసుకోవడానికి సంకోచించవద్దు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై విద్యాసంస్థలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సాయం అందుబాటులో ఉండాలి. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు.. జీవితంపై ఆశ కోల్పోవద్దు'' అని డా.రాయపాటి శైలజ సూచించారు.

## రాష్ట్రంలో పటిష్ఠ శాంతిభద్రతల వల్లే పెట్టుబడులు వస్తున్నాయి: మంత్రి అచ్చెన్న

- **శ్రీకాకుళంలో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న అచ్చెన్నాయుడు**
- **గత 8 నెలల్లో 5,800 పోలీసు పోస్టులు భర్తీ చేశామని వెల్లడి**
- **మరో 1,156 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామన్న అచ్చెన్నాయుడు**



రాష్ట్ర ప్రగతికి శాంతిభద్రతలే పునాది అని, ఆంధ్రప్రదేశ్‌లో లా అండ్ ఆర్డర్ పటిష్ఠంగా ఉండటం వల్లే పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించగలుగుతున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన కానిస్టేబుళ్ల పాసింగ్‌అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. 10 నెలల కఠిన శిక్షణ పూర్తి చేసుకున్న 142 మంది నూతన కానిస్టేబుళ్లను మంత్రి అభినందించారు. పోలీసు వృత్తిలోకి అడుగుపెడుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు ఉద్యోగం కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని గుర్తుచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోలీసు నియామకాలపై మంత్రి కీలక ప్రకటన చేశారు. గత 8 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,800 పోలీసు పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. తాజాగా మరో 1,156 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. ఇకపై ప్రతి ఏటా క్రమం తప్పకుండా పోలీసు నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. నేరాల నియంత్రణకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు.

## ఏపీలోని 6 జిల్లాలకు వర్ష సూచన.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

- **ఆరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు కురిసే అవకాశం ఉందన్న విపత్తుల నిర్వహణ సంస్థ**
- **ఉరుములు, మెరుపులతో కూడిన వర్షా ల వేళ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన**
- **పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉందని వెల్లడి**



ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం.. ప్రధానంగా ఆరు జిల్లాల్లో వర్ష ప్రభావం ఉండనుంది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో మంగళవారం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది. వీటితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఇతర జిల్లాల్లోనూ కొన్నిచోట్ల చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురవవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలకు అధికారులు పలు సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున స్థానిక పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- **దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం**
- **ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య**
- **ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ**




రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా.. కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- **కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం**
- **కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు**
- **కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత**
- **ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు**
- **రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు**






బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

## అధికారంలో లేకున్నా తగ్గని జోరు..
## బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు




తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2025..26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (202425) పార్టీకి రూ.15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

## బుల్లెట్ ట్రైన్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా: కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

- **బుల్లెట్ ట్రైన్ భూసేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్న కేటీఆర్**
- **బహదూర్‌పల్లి రైతుల వ్యవసాయ భూములను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి**
- **శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రభుత్వ భూమి ఉండగా రైతుల భూములు ఎందుకని ప్రశ్న**



బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ అభివృద్ధికి గానీ, బుల్లెట్ ట్రైన్‌కు గానీ వ్యతిరేకం కాదని, కానీ దాని ముసుగులో రైతుల భూములను లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న బహదూర్‌పల్లి వ్యవసాయ భూములను ఎందుకు సేకరిస్తున్నారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక రైల్వే స్టేషన్ కోసం వెయ్యి ఎకరాలు అవసరమా? అని నిలదీశారు. రైతుల భూములపై సుమారు 4,000 మంది పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వం వద్ద సరైన పత్రాలు ఉంటే వాటిని రైతులకు చూపించాలి, అంతేకానీ పోలీసులను పెట్టి భయపెట్టడం ఎందుకు?" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. "ఏడాదిన్నరలో మీ ఆశీస్సులతో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారు. మీ పట్టాలు మీకే ఇప్పిస్తాం. మీకోసం హైకోర్టుకు వెళ్లిన కార్తీక్ రెడ్డి ద్వారానే మీకు పట్టాలు అందేలా చూస్తాం," అని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులు అధైర్యపడొద్దని, ఐక్యంగా ఉండాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా, న్యాయపరంగా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా.. నలుగురికి గాయాలు

మోతె: డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడపడంతో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడగా నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మంగళవారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న మైత్రీ ట్రావెల్స్‌కు చెందిన బస్సును డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపటంతో ప్రమాదానికి గురైంది. సూర్యాపేట జిల్లా మోతె మండలం హుస్సేనాబాద్ గ్రామ శివారులో పెట్రోల్ పంపు ఎదురుగా బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉండగా నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్సులో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉంది.

## మోదీని ఎదుర్కోలేక ఈసీ, ఈవీఎంలపై నిందలేస్తారా?: బండి సంజయ్

హైదరాబాద్: ప్రధాని మోదీని ఎదుర్కొనే దమ్ములేక ఎన్నికల సంఘం, ఈవీఎంలపై నిందలేస్తారా? అని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ (Bandi Sanjay) ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ (Congress) గెలిచినప్పుడు సీడబ్ల్యూసీకి ఈవీఎంలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. సర్ ప్రకియ వల్లే గెలిచామని కేరళ కాంగ్రెస్ నేతలు ప్రకటించిన విషయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మర్చిపోయిందా? అని నిలదీశారు. "మోదీ ఎందుకు రాజీనామా చేయాలి? మూడుసార్లు వరుసగా దేశ ప్రజలు అప్రతిహతంగా గెలిపించినందుకు రాజీనామా చేయాలా? దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనాన్ని, భారతీయుల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నందుకు రాజీనామా చేయాలా? మోదీ ప్రభుత్వాన్ని బ్రిటీష్ పాలనతో పోల్చడం హేయనీయం. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను అపహస్యం చేయడమే. సర్ సిబ్బంది అంతా రాష్ట్ర ప్రభుత్వ అధికారులే కదా? సర్‌లో పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకునే వ్యవస్థ ఉంది. కేంద్రంపై నెపం నెట్టడం దుర్మార్గం. ఇటలీ మూలాలున్న కాంగ్రెస్ నేతలకు భారత ప్రజాస్వామ్యమంటే చులకన. సర్ కొత్త ప్రక్రియ కానేకాదు. గతంలోనూ నిర్వహించారు. సుప్రీంకోర్టు కూడా దీన్ని సమర్థించింది. ఎన్నికల్లో ఎవరు గెలవాలనేది ప్రజలు నిర్ణయిస్తారు. ఎన్నికల్లో ఎవరు ఓటు వేయాలనేది చట్టబద్ధమైన ఓటరు జాబితా నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనదైతే.. ఓటరు జాబితా కూడా అంతే పవిత్రంగా ఉండాల్సిందే. సర్ ప్రక్రియతో ఎన్నికల సంఘం చేసిన తప్పేమిటి? ఆధారాలుంటే బయటపెట్టండి'' అని బండి సంజయ్ సవాల్ విసిరారు.

# అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి: మోహన్ భగవత్

- చివరి వ్యక్తి సంక్షేమమే అభివృద్ధికి గీటురాయి అన్న భగవత్
- అభివృద్ధిలో అంతరాలు వీలైనంత తగ్గించాలని సూచన
- ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతి సాధించాలి
- అభివృద్ధి బాధ్యత సమాజం కూడా తీసుకోవాలని పిలుపు

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని



హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా 'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.

## ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్ కన్నుమూత



వరదయ్యపాలెం: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్(85) కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురై పదిరోజులుగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ట్రస్టు ప్రతినిధి ఒకరు తెలిపారు. భగవాన్ కుమారుడైన కృష్ణాజీతో పాటు ఆశ్రమానికి (ఏకం ట్రస్టు) చెందిన దాసాజీలు, ప్రతినిధులు చెన్నైలోని ఆసుపత్రి వద్ద ఉన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం బత్తులవల్లంలోని ఏకం ఆలయాని (గోల్డెన్ సిటీ) కి కల్కి భగవాన్ పార్థివదేహాన్ని తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. ఏకం ఆలయాన్ని రూ.200 కోట్లతో పాలరాతితో నిర్మించారు. ఆలయంలోనే కల్కి భగవాన్ అంత్యక్రియలను శనివారం నిర్వహించేందుకు, సమాధి నిర్మాణానికి పనులు సాగుతున్నాయి. సతీమణి అమ్మభగవాన్‌తో కలిసి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన కల్కి భగవాన్‌కు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. విజయ్‌కుమార్ పేరుతో ఎల్ఐసీ ఏజెంటుగా, ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన 1992లో తాను కల్కి అవతారమంటూ కల్కి భగవాన్ పేరుతో ప్రపంచానికి పరిచయమయ్యారు. తొలుత కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ఆపై తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు సమీపంలో నేమం ప్రాంతంలో కల్కి భగవాన్‌గా ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ఆపై వరదయ్యపాలెం పంచాయతీ గోవర్ధనపురంలో కల్కి గ్రామీణాభివృద్ధి ట్రస్టు పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆశ్రమాల్లో విదేశీ భక్తులతో పాటు, దేశం నలుమూలల నుంచి వచ్చే వారికి ధ్యానం, ముక్తి దీక్ష తదితర ఆధ్యాత్మిక తరగతులు నిర్వహించేవారు. కల్కి గ్రామీణాభివృద్ధి, వన్నెస్ హ్యూమన్, లోకా ఫౌండేషన్, ముక్తి తదితరాల పేరిట ట్రస్టులు ఏర్పాటు చేశారు.

## ఓ క్రమపద్ధతిలో ప్రజాస్వామ్య పునాదులు ధ్వంసం - సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే

ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అవకతవకలకు ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర వ్యవస్థలను ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. మంగళవారం దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''ఎన్నికల జాబితాల్లో మార్పులకు సంబంధించిన సమాచారం మొత్తం బహిర్గతం చేయాలి. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలను సకాలంలో అందించాలి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంచాల్సిన అవసరం ఉంది'' అని ఖర్గే సూచించారు. ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు.. సీఈసీ చర్యలు ఏకపక్షంగా ఉన్నాయని పేర్కొన్నారని ఖర్గే వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ భాజపా చేతిలో కీలుబొమ్మలా మారారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగేందుకు.. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడేందుకు పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



అవసరమైతే వాటిని సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కి అండగా నిలిచిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు.

## పాక్ గగనతల నిషేధం వేళ.. చైనాతో భారత్ చర్చలు!

పహల్గాం ఉగ్ర ఘటన అనంతరం భారత్ విమానయాన సంస్థలకు పాకిస్థాన్ గగనతలంపై నిషేధం కొనసాగుతోంది. దీంతో భారత విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయం కోసం చైనాతో భారత్ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్వయంప్రతిపత్తి ప్రాంతమైన షిన్‌జియాంగ్‌లోని హోటాన్ మార్గంలో వెళ్లేందుకు వారితో చర్చిస్తున్నట్లు సమాచారం. అయితే, ఏడాదిగా ఈ ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఇంకా ఒప్పందం కుదరలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతేడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్‌లు గగనతల వినియోగంపై పరస్పరం ఆంక్షలు



విధించుకున్నాయి. సైనిక విమానాలు సహా భారత్‌కు చెందిన విమానయాన సంస్థలు నడిపించే సర్వీసులపై పాక్ నిషేధం విధించింది. అప్పటినుంచి ప్రతి నెల వాటిని పొడిగిస్తూ వస్తోంది. దీంతో ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం, నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తోంది.

## నలుగురు CISF సిబ్బందిని కాల్చిచంపిన జవాన్

ఇద్దరు సీఐఎస్ఎఫ్ జవాన్ల మధ్య మొదలైన గొడవ.. నలుగురు తోటి సిబ్బంది మరణానికి కారణమైంది. ఇద్దరిలో ఒకరు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో.. అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది మృతి చెందారు. జమ్మూకశ్మీర్‌లోని కఠువా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా హిమాచల్ ప్రదేశ్‌కు సరిహద్దులో ఉన్న మష్కా గ్రామంలోని సేవా III విద్యుత్ ప్రాజెక్టు వద్ద విధుల్లో ఉండగా.. ఈ ఘటన



చోటుచేసుకుంది. వెంటనే అక్కడకు చేరుకున్న ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## ఉక్రెయిన్‌తో యుద్ధం.. అమెరికా మాజీ సైనికులకు రష్యా ఎర..!

నాలుగేళ్లకుపైగా రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల కాలంలో ఇరుదేశాలు భీకర దాడులు చేసుకుంటున్నాయి. స్వదేశీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రజలను యుద్ధంలో పోరాడేందుకు రష్యా ఎప్పటినుంచో నియమించుకుంటోంది. ఈ నేపథ్యంలో మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. వారిలో అమెరికన్లు కూడా ఉన్నారని.. సామాజిక మాధ్యమాల వేదికగా వారికి రష్యా ఎరవేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 26,000 డాలర్ల వరకు చెల్లిస్తామన్న హామీతో.. కనీసం 18 మంది అమెరికా జాతీయులను దళాల్లోకి తీసుకుందని తెలిపింది. వారిలో కొందరు మాజీ సైనికులు కూడా ఉన్నారని పేర్కొంది. యుద్ధ రంగంలో తమ వైపు పోరాడేందుకు వచ్చే అమెరికన్లకు 26వేల డాలర్ల సైనింగ్ బోనస్ (ఏకమొత్తంలో చెల్లించే ఆర్థిక ప్రోత్సాహకం), నెలవారీగా 2,000 డాలర్ల జీతం ఇస్తామని రష్యా తరఫున కొందరు ఏజెంట్లు ఎరవేస్తున్నారు. టిక్‌టాక్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేస్తూ.. పేదలు, అమెరికా వ్యతిరేక భావజాలం ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. అలా నియమితులైన వారిని యుద్ధరంగంలో ముందువరుసలో నిలబెడుతున్నారని.. దాంతో పలువురు రష్యా సైన్యంలో



చేరిన కొంతకాలానికే ప్రాణాలు కోల్పోయారని ఉక్రెయిన్ నిఘా వర్గాలు వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది.

*** రష్యాకు మరో 10,000 మంది ఉత్తర కొరియా సైనికులు: జెలెన్‌స్కీ**

ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరఫున ఉత్తరకొరియా సైనికులు పోరాడుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వేలల్లో ఉత్తరకొరియా దేశీయులను రష్యాకు పంపినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా మరో 10వేల మంది సైనికులను పంపేందుకు కిమ్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. గతంలో కూడా జెలెన్‌స్కీ ఈ తరహా ప్రకటనలు చేశారు. 50,000 మంది వరకు ఉత్తర కొరియా సైనికులను రష్యాకు పంపే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. రష్యా దళాల తరఫున పోరాడుతున్న 135 దేశాలకు చెందిన 29వేల మందిని గుర్తించామని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. వాస్తవ లెక్కలు ఇంతకంటే ఎక్కువే ఉంటాయని చెప్తున్నారు.

## రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి.. విజయ్‌పై ఆ రెండు పార్టీల నెగెటివ్ ప్రచారం!



కోయంబత్తూర్: టీవీకే చీఫ్, తమిళనాడు సీఎం విజయ్‌పై డీఎంకే, అన్నా డీఎంకే పరస్పర సమన్వయంతోనే వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నాయని మంత్రి అధవ్ అర్జున ఆరోపించారు. రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న వేళ ఆ రెండు పార్టీలూ విజయ్‌ను లక్ష్యంగా చేసుకొని వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నాయని మండిపడ్డారు. చూస్తుంటే ఇది ఆ రెండు ద్రావిడ పార్టీల మధ్య 'అప్రకటిత అవగాహన'లాగే కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల్లో విజయ్ ప్రచారానికి విశేష ఆదరణ లభించిందన్న అధవ్.. తమ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. కోయంబత్తూర్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం డీఎంకే సిద్ధాంతపరమైన అంశాలపై కాకుండా అసభ్యకర మాటలు, దుష్ప్రచారం, పలువురిపై వ్యక్తిగత దూషణలపైనే దృష్టి పెట్టిందని మంత్రి ఆక్షేపించారు. అన్నాడీఎంకే కూడా ఎంజీఆర్, జయలలిత సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చిందని, పళనిస్వామి కుటుంబ నియంత్రణలోనే ఆ పార్టీ ఉండటంతో విధేయులైన కార్యకర్తలను పక్కన పెడుతున్నారని ఆరోపించారు. స్వప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయ వైరాన్ని సైతం పక్కనపెట్టి పళనిస్వామి నేతృత్వంలో డీఎంకే, అన్నాడీఎంకేలు 'అపవిత్ర కూటమి' ఏర్పాటు చేసి ప్రతికూల వ్యూహాలు రచిస్తున్నాయని మండిపడ్డారు. డీఎంకేతో జట్టు కట్టారంటూ డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయ్‌కాంత్ పైనా అధవ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో వ్యతిరేకించిన పార్టీతో ప్రేమలత రాజీపడ్డారని.. దీంతో దివంగత నటుడు, డీఎండీకే వ్యవస్థాపకుడు విజయ్‌కాంత్ ఆత్మ కూడా ఆమెను క్షమించదన్నారు.

## "నేను ఇరాన్‌కు ఏ హామీ ఇవ్వలేదు": ఆంక్షల సడలింపుపై ట్రంప్



ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌కు ఆంక్షల సడలింపు, నిలిపివేసిన నిధుల విడుదలకు తాను ఎలాంటి ప్రతిపాదన చేయలేదని స్పష్టం చేశారు. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను సడలించేందుకు అమెరికా సిద్ధమైందని వస్తోన్న వార్తలను ఆయన ఖండించారు. ''ఇది అవాస్తవం. నేను వారికి హామీ ఇవ్వలేదు'' అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధికారులు మాత్రం ఇరాన్‌తో పరోక్ష చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ''ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ సంప్రదింపులు జరుగుతున్నాయి. అణు కార్యక్రమంపై ఇరాన్ స్పష్టమైన హామీలు ఇవ్వాలని అమెరికా కోరుతోంది'' అని చెబుతున్నారు.

*** ఇరాన్ దాడుల్లో యూఎస్ సైనికులకు గాయాలు**

ఇరాన్ దాడిలో ఎనిమిది మంది అమెరికా (US) సైనికులు తీవ్రంగా గాయపడిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబరు 14న హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేసినట్లు అమెరికా అధికారులు తెలిపారు. దాడి సమయంలో అందులో ఉన్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనను అమెరికా ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించనప్పటికీ.. తాజాగా సైనికుల గాయాల వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న సమయంలోనే ఇది బయటపడటం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధ తీవ్రతను తక్కువ చేసి చూపించడానికే ట్రంప్ ప్రభుత్వం ఈ విషయాన్ని దాచిపెట్టిందనే విమర్శలు వస్తున్నాయి. హర్మూజ్ జలసంధి సంక్షోభం, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతార్ మధ్యవర్తుల ద్వారా అమెరికాతో ఇరాన్ మరోసారి పరోక్ష చర్చలు జరిపిందని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ఈ చర్చలకు సంబంధించి అమెరికా స్పందన కోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే సమాధానం రావచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బలూచ్ మహిళా రెబల్స్ దాడి.. 9 మంది పాక్ సైనికులు మృతి!

బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్‌లో కొత్తగా ఏర్పడిన మహిళా విభాగం క్షేత్రస్థాయిలో దూకుడుగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై మెరుపుదాడి జరిపింది. ఈ ఘటనలో తొమ్మిది మంది పాక్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వీడియోను బీఎల్ఎఫ్ విడుదల చేసింది. బలూచ్ తిరుగుబాటుదారులకు సంబంధించి కొత్తగా ఏర్పడిన కరీమా సాయుధ దాడి విభాగం పాక్ ఆర్మీ లక్ష్యంగా ఇటీవల ఆపరేషన్ చేపట్టింది. ఈ క్రమంలో బలూచ్ ప్రావిన్సులోని చైనా పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ హైవే దగ్గరకు చేరుకున్న ఈ సాయుధ బృందసభ్యులు.. రైఫిళ్లు పట్టుకొని కాన్వాయ్‌కు అతి దగ్గరకు వెళ్లి దాడి చేశారు.

## క్యాన్సర్ ఔషధాల అధిక ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: క్యాన్సర్ మందులను అధిక ధరకు విక్రయిస్తుండటంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఔషధాల ధరలపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రిటైలర్లకు కేవలం రూ.2,700కే సరఫరా అవుతున్న ఒక క్యాన్సర్ ఔషధంపై.. రూ.27 వేల ఎంఆర్‌పీ ముద్రించడం దిగ్భ్రాంతికరమని పేర్కొంది. అన్ని మందులపై ఏకరీతిగా 16 శాతం మార్జిన్ ఉండాలని తెలిపింది. అదేవిధంగా తమ మెడికల్ దుకాణాల నుంచే మందులు కొనాలంటూ ఆస్పత్రులు నిర్దేశించడంపై దృష్టి సారించాలని కేంద్రానికి సూచించింది. ఈ విధానం వల్ల సామాన్యుడే నష్టపోతున్నాడని పేర్కొంది.





# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని అంటున్నారు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.
శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్

సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మ రసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మ రసంలో విటమిన్ సి ఉంటుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. అదేవిధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
దిన పత్రిక





## స్లమ్ డాగ్' నుంచి జుబేదా గా జరీనా వహాబ్ గ్లింప్స్ రిలీజ్

డైనమిక్ ఫిల్మ్‌మేకర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రం ప్రమోషనల్ మెటీరియల్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ తమ పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై జేబీ నారాయణరావు కొండ్రొల్లా జేబీ మోషన్ పిక్చర్స్ తో కలిసి ఈ చిత్రాన్ని గ్రాండ్ రూపొందిస్తున్నారు. ఇందులో టబు పవర్ ఫుల్ పోలీస్ అధికారిణి పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర గ్లింప్స్‌కు కూడా మంచి స్పందన లభించింది. తాజాగా చిత్ర బృందం హార్ట్ టచింగ్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో విజయ్ సేతుపతి అమ్మ జుబైదాగా జరీనా వహాబ్ పాత్రను పరిచయం చేశారు. తన జీవితంలో ఎదురైన అత్యంత బాధాకరమైన సంఘటనను జుబైదా గుర్తుచేసుకునే ఎమోషనల్ ఎపిసోడ్‌ను ఈ గ్లింప్స్‌లో చూపించారు. ఓ రైల్వే స్టేషన్‌లో చనిపోవాలని అనుకున్నానని.. కానీ ఆకలి వేధించడంతో చివరికి అడుక్కోవాల్సి వచ్చిందని ఆమె చెప్పే సన్నివేశం హృదయాన్ని హత్తుకునేలా ఉంది. ఒక బిచ్చగాడి జీవితంలో ఎదురయ్యే కఠినమైన, బయట ప్రపంచానికి పెద్దగా తెలియని వాస్తవాలను ఈ సన్నివేశం ఆవిష్కరిస్తుంది. అదే సమయంలో సినిమా కథలోని ప్రధాన భావోద్వేగాన్ని కూడా పరిచయం చేస్తుంది. బతుకు పోరాటం, ఆత్మగౌరవం, ఒక తల్లి భావోద్వేగ ప్రయాణాన్ని ఎంతో సహజంగా, మానవీయంగా చూపించిన ఈ సన్నివేశం ప్రేక్షకుల మనసును తాకేలా ఉంది. డిఫరెంట్ స్టోరీ టెల్లింగ్, డైనమిక్ ప్రజెంటేషన్ తో కట్టిపడేసే పూరి జగన్నాథ్ ..తన కెరీర్‌లో ఇంటెన్స్ ఎమోషన్స్‌ను కూడా అంతే బలంగా హ్యాండిల్ చేశారు. జుబైదా పాత్ర పరిచయం కూడా రచయితగా, దర్శకుడిగా పూరి జగన్నాథ్ బలాన్ని మరోసారి చూపిస్తోంది. ఎంతో ఆకట్టుకునే సిట్యుయేషన్ ద్వారా భావోద్వేగాలతో కూడిన పాత్రను పరిచయం చేశారు. జరీనా వహాబ్ జుబైదా పాత్రలో అద్భుతమైన నటనను కనబరిచారు. పాత్రకు అవసరమైన డెప్త్, ఎమోషన్‌ను ఆమె తన నటనతో తీసుకొచ్చారు. ఈ పాత్ర కథకు బలమైన ఎమోషనల్ లేయర్‌ను యాడ్ చేస్తోంది. ఈ గ్లింప్స్‌లో విజయ్ సేతుపతితో పాటు ఇతర ప్రముఖ నటీనటులు కూడా కనిపించారు. సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా.. దునియా విజయ్, బ్రహ్మాజీ, వి.టి.వి. గణేష్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సామ్ కె. నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్నారు. సంతోష్ నూజిలా ఎడిటింగ్. 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్' తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్‌ఇండియా రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

## లోకేష్ సినిమాలో పోలీస్ పాత్ర?



అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ రూపొందిస్తున్న 'రాకా' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. దీని తర్వాత తమిళ అగ్ర దర్శకుడు లోకేష్ కనకరాజ్‌తో బన్నీ ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతున్నది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ పోలీస్ పాత్రలో కనిపించనున్నాడట. గతంలో 'రేసుగుర్రం' చిత్రంలో అల్లు అర్జున్ పోలీస్ క్యామియో చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ లోకేష్ కనకరాజ్ సినిమాలో బన్నీ పోలీస్ రోల్ పోషిస్తున్నది నిజమైతే.. ఆయన్ని పూర్తిస్థాయి కాప్‌రోల్‌లో చూడొచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'రాకా' చిత్రం వచ్చే ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాతే బన్నీలోకేష్ కనకరాజ్ సినిమా పట్టాలెక్కనుంది.

## అనుభూతినిచ్చే తత్వం



'హీరోయిన్ కావడం నా డ్రీమ్. ఆ ప్రయత్నంలో ఉండగా ఈ అవకాశం వచ్చింది. ఆడిషన్స్ చేసి నన్ను సెలక్ట్ చేశారు. ఇందులో నాది విలేజ్ నేపథ్యంలో సాగే ఎమోషనల్ క్యారెక్టర్. తొలి సినిమాలోనే నటనకు అవకాశం ఉన్న పాత్ర దొరకడం అదృష్టంగా భావిస్తున్నా' అని నటి దష్విక.కె అన్నారు. దినేష్ తేజ్ సరసన ఆమె నటించిన చిత్రం 'తత్వం' మర్డర్ మిస్టరీ నేపథ్య కథాంశంతో రూపొందిన ఈచిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. శీమకుర్తి వంశీకృష్ణ, శ్వేత పసుపులేటి నిర్మాతలు. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో దష్విక విలేకరులతో మాట్లాడింది. ఇందులోని తన పాత్రలో గ్రే షేడ్స్ ఉంటాయని, కిల్లర్ అన్వేషణలో హీరోకి సపోర్ట్ చేస్తూ ఉంటానని, జనరల్‌గా మలయాళంలో ఇలాంటి కథలు వస్తుంటాయని, తెలుగులో ఈ తరహా కథ రావడం ప్రథమమని, ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే సినిమా ఇదని కథానాయిక దష్విక పేర్కొన్నారు. దర్శకుడు అర్జున్ క్లారిటీతో సినిమా చేశారని, హీరో దినేష్ యాక్షన్ సీక్వెన్స్ చేసేటప్పుడు చాలా సహకరించారని, సాంకేతికంగా కూడా సిని మా అభినందనీయంగా ఉంటుందని దష్విక తెలిపింది.



## అరుదైన కథాంశంతో 'మయూఖ'

పాయల్ చంగప్ప ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'మయూఖ'. శ్రీతేజ్ ఎస్‌కే దర్శకత్వంలో శశిధర్ నల్ల నిర్మించిన ఈచిత్రం అక్టోబర్ 9న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. 'మయూఖ' లాంటి సినిమాలు తెలుగులో అరుదుగా వస్తాయని, హాలీవుడ్, కొరియన్ సినిమాల స్థాయిలో సీజీ వర్క్ ఉంటుందని, సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని డైరెక్టర్ శ్రీతేజ్ ఎస్‌కే తెలిపారు. ఈ సినిమా తర్వాత హీరోయిన్ పాయల్ చంగప్పను అంతా 'మయూఖ' అనే పిలుస్తారని నిర్మాత శశిధర్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల పాయల్ చంగప్ప ఆనందం వెలిబుచ్చారు. ఇంకా ఇతర పాత్రధారులు, మాస్టర్ షణ్ముఖ్ చరణ్, బేబీ మది నస్రీన్, నానానీ కర్రీ, దేవ్‌డి, రఘు వాసి రెడ్డి, అభిలాష్ అడ్డ కూడా మాట్లాడారు.

## ప్రభాస్ రివిల్ చేసిన 'రోమియో జూలియట్' మూవీ స్టోరీ గ్లింప్స్



హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ జెన్‌జెడ్ లవ్ డ్రామా 'రోమియో జూలియట్'. భార్గవ్ మాచర్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవ రస ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సందీప్ ఎన్, వెంకటేశ్వరరావు చల్లగుల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గద్దం రాకేష్‌రెడ్డి, రుద్రదేవ్ మాడిరెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

సాధారణంగా తెలుగు సినిమాలు ఫస్ట్ షో పడే వరకు కథను, కథలోని కీలక అంశాలను సీక్రెట్‌గా ఉంచుతాయి. అయితే 'రోమియో జూలియట్' మేకర్స్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు దాదాపు నాలుగు వారాల ముందే.. ఈరోజు చిత్రంలోని స్టోరీ రివీల్ వీడియోను విడుదల చేశారు. అక్టోబర్ 23, 2026న థియేటర్లలోకి రానున్న ఈ సినిమా కథలోని కోర్ పాయింట్‌ను ముందుగానే ప్రేక్షకులకు పరిచయం చేయడం టాలీవుడ్‌లో అరుదైన ప్రయత్నంగా చెప్పొచ్చు. తమ కంటెంట్, డిఫరెంట్ నెరేటివ్‌పై టీమ్‌కు ఉన్న నమ్మకాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. మరో ప్రత్యేకత ఏమిటంటే.. వరల్డ్ రెబల్స్ డే సందర్భంగా, రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజునే 'రోమియో జూలియట్' థియేటర్లలోకి రానుంది. ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ స్టోరీ రివీల్ గ్లింప్స్‌ను విడుదల చేసి.. చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. గ్లింప్స్ విషయానికి వస్తే.. ఇందులో హీరో ఒక లోకల్ గన్ డీలర్‌ను కలసి ఓ ఆయుధాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తాడు. ఓ అమ్మాయిని చంపాలనే ఉద్దేశంతో ఆ ఆయుధాన్ని కొనుగోలు చేయాలని చూస్తాడు. అక్కడి నుంచి కథ మోడరన్ రిలేషన్స్ చుట్టూ తిరిగే కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. వన్ నైట్ స్టాండ్, హుకప్, ఫ్లింగ్, బెంచింగ్, సిట్యుయేషన్‌షిప్, బాయ్ బెస్టీ వంటి నేటి రిలేషన్‌షిప్ టెర్మ్స్‌ను హీరో వివరించే విధానం ఆసక్తికరంగా ఉంది. దీంతో 'రోమియో జూలియట్' ఒక సాధారణ లవ్ స్టోరీ కాదనే విషయం స్పష్టమవుతోంది. ప్రస్తుత జెన్‌జెడ్ తరం ప్రేమను, రిలేషన్‌షిప్స్‌ను, గొడవలు, బ్రేకప్స్‌ను ఎలా చూస్తోంది? సిట్యుయేషన్‌షిప్స్, సోషల్ మీడియా, పబ్లిక్ బ్రేకప్స్, మారుతున్న రిలేషన్‌షిప్ అంశాలు కథలో కీలకంగా ఉండనున్నాయి. ముఖ్యంగా 18 నుంచి 25 ఏళ్ల వయసున్న యువతను టార్గెట్ చేస్తూ.. వాళ్లకు తెలిసిన భాష, రిలేషన్‌షిప్ డైనమిక్స్‌తో కథను తెరకెక్కించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. బోల్డ్ ప్రిమైజ్, కాంటెంపరరీ ట్రీట్‌మెంట్‌తో విడుదలైన ఈ స్టోరీ రివీల్ గ్లింప్స్ ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆసక్తిని పెంచుతోంది. జెన్‌జెడ్ రిలేషన్‌షిప్స్‌ను డిఫరెంట్ యాంగిల్‌లో చూపించే ప్రయత్నంగా 'రోమియో జూలియట్' ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'రోమియో జూలియట్'కు భార్గవ్ మాచర్ల, ప్రశాంత్ రాఘతి కథ అందించారు. గోపి సుందర్ సంగీతం సమకూరుస్తున్నారు. అభిరాజ్ నాయర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, యువ కిరణ్ ఎడిటింగ్. కార్తా ప్రొడక్షన్స్ ధీరజ్ పానుగోటి, ప్రకీర్తి ఉప్పలపాటి ప్రొడక్షన్ డిజైన్. తారాగణం: హర్షిత్, విశాఖ ధీమాన్, వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శీను, అజయ్ ఘోష్, అజయ్